## ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1 9, జనవరి, 2015

అత్యుత్తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని ప్రదర్శిస్తున్న తెలంగాణ జెన్‌కొ దేశంలోని అన్ని రకాల విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు ఆదర్శంగా నిలుస్తున్నదని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. ప్రభుత్వ రంగంలో విద్యుత్ ఉత్పత్తి జరగాలనే తన సంకల్ప బలాన్ని జెన్‌కో ఉద్యోగులు తమ పనితనంతో బలపరుస్తున్నారని ముఖ్యమంత్రి అభినందించారు. వరంగల్ జిల్లా భూపాలపల్లిలోని కే.టి.పి.టిని ముఖ్యమంత్రి శుక్రవారం సందర్శించారు. 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని అడుగడుగు తిరిగి పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న 600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం పనుల పురోగతిని సమీక్షించారు. 500 మెగావాట్ల ఉత్పత్తి కేంద్రంలో వందకు వంద శాతం ఉత్పత్తి {పిఎల్‌ఎఫ్} సాధిస్తున్నందుకు అభినందించారు. భూపాలపల్లి విద్యుత్ ప్లాంట్ సగటున 95.08 శాతం పిఎల్‌ఎఫ్ సాధించినందుకు సంతోషం వ్యక్తం చేశారు. ఇది దేశంలోనే అత్యుత్తమ రికార్డు అని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ సమస్యను అధిగమించే దిశలో ఇలాంటి ఫలితాలు ఎంతో స్ఫూర్తిని ఇస్తాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో ప్రస్తుత విద్యుత్ సమస్యను అధిగమించేందుకు, భవిష్యత్ అవసరాలను తీర్చేందుకు కావలసిన 10,000 మెగావాట్ల అదనపు థర్మల్ విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ఇందులో 6000 మెగావాట్లు జెన్‌కో ద్వారా, 4000 మెగావాట్లు ఎన్‌టిపిసి ద్వారా ఉత్పత్తి చేస్తామన్నారు. ప్రైవేట్ విద్యుత్ ఉత్పత్తి సంస్థల కన్నా తనకు ప్రభుత్వ రంగ సంస్థలపైనే నమ్మకం ఎక్కువ అని, ప్రభుత్వ ఉద్యోగులపైనే తనకు అచంచల విశ్వాసం ఉందని ముఖ్యమంత్రి వెల్లడించారు. తెలంగాణలో బొగ్గు, నీరు పుష్కలంగా ఉన్నప్పటికి ఇక్కడ విద్యుత్ ప్లాంట్లు

పెట్టే విషయంలో సమైక్య రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పూరితంగా వ్యవహరించాయన్నారు. వనరులు, డిమాండ్ తెలంగాణలో ఉన్నప్పటికి, ఆంధ్రలో అవసరానికి మించిన ప్లాంట్లు పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ లోపాన్ని సవరించడానికి, లోటును పూడ్చేందుకు, మూడేళ్లలో కరెంట్ సమస్యలన్నీ అధిగమించేందుకు, తెలంగాణ రాష్ట్రాన్ని మిగులు విద్యుత్ రాష్ట్రంగా మార్చేందుకు చేస్తున్న ప్రయాత్నాలను ముఖ్యమంత్రి మరొక్కసారి ఉద్యోగులు, అధికారులకు గుర్తు చేశారు. ఉద్యోగులు కూడా చిత్త శుద్ధితో పనిచేయాలని, తెలంగాణ రాష్ట్రాన్ని విద్యుత్ మిగులు రాష్ట్రంగా మార్చే బాధ్యత తీసుకోవాలని ముఖ్యమంత్రి అన్నారు. 2009 లో భూపాలపల్లిలో ప్రారంభమైన 600 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ నేటికి పూర్తి కాకపోవడానికి గత ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమన్నారు. ఈ ఏడాది ఆగష్టు చివరి నాటికి భూపాలపల్లిలో 600 మెగావాట్ల ప్లాంటులో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం కావాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. భూపాలపల్లి విద్యుత్ ప్లాంట్ మాదిరిగానే రాష్ట్రంలోని అన్ని విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలలో కూడా గరిష్ట పిఎల్ఎఫ్ నమోదు కావాలని కోరారు. గడిచిన ఆరు నెలల్లో జెన్కో పనితీరులో ఎంతో మార్పు వచ్చిందని, గతంలో కంటే ఎక్కువ విద్యుత్ ఉత్పత్తి చేశారని అభినందించారు. ఇదే వరవడి కొనసాగించాలన్నారు. నిర్మాణంలో ఉన్న బాయిలర్లు, వాటర్ కూలింగ్ టవర్స్, కంట్రోల్ రూములు తదితర నిర్మాణాలను ముఖ్యమంత్రి పరిశీలించారు. అధికారులు, ఉద్యోగులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వెంట స్పీకర్ మధుసుధనాచారి, డిప్యూటి సిఎం డా.టి.రాజయ్య, విద్యుత్ శాఖ మంత్రి సి.లక్ష్మారెడ్డి, జెన్కో సిఎండి డి. ప్రభాకర్‌రావు తదితరులు ఉన్నారు.

---

సిపిఆర్ఓ టు సిఎం